క్లుప్తంగా

వినాయక విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని అయోధ్యనగర్‌లో సిందూర్ వరసిద్ధి వినాయక, ఆంజనేయస్వామి, ధ్వజస్తంభ, నవగ్రహ, జంట నాగుల ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గణపతి పూజతో ప్రారంభమై బుధవారం విగ్రహ ప్రతిష్ఠతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు



రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం సీతారామచంద్రుల ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు సంతోష్‌గుప్తా, మహిపాల్‌రెడ్డి, భీమయ్య, మల్లయ్య, పుల్లారెడ్డి, నర్సింహులు, వెంకటయ్య, మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



నవాబుపేట: ఉపాధి పనుల్లో కూలీలు మరింత వేగం పెంచాలని ఎంపీడీఓ జయరాంనాయక్, ఏపీఓ జ్యోతిలు తెలిపారు. శనివారం మండలంలోని కాకర్లపహాడ్ గ్రామంలో ఉపాధి పనులు వారు పరిశీలించారు. వేసవి కాలం పూర్తి కావస్తున్న తరుణంలో తాజాగా చేపట్టిన పనులు పూర్తి చేసేలా కూలీలు పనుల్లో వేగం పెంచాలన్నారు. ప్రధానంగా రైతులకు అవసరమైన పనులు, భూగర్భ జలాలు పెంపొందించే పనులు చేపట్టాలని వారు సూచించారు.

గుట్కా, పొగాకుకు దూరంగా ఉండాలి



నవాబుపేట: గుట్కా, పొగాకు ప్రజలు దూరంగా ఉండాలని, పొగాకు రహిత సమాజం చాలా ఆరోగ్యకరంగా ఉంటుందని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వల్ల వచ్చే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి పొగాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీడీ సిగరెట్ గుట్కాలతో మనిషి ఆయువు తగ్గుతుందని, వాటిని మా నేస్తే మనిషి అయుషు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాములు, శ్రీనివాస్, రాఘవేందర్, ఆశ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

మద్దిగట్లకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు

భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల గ్రామానికి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామంతో పాటు వ్యవసాయ రైతులకు విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్దుబాటుతో ప్రాథమిక విద్యకు నష్టం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని సూచించిందని, ఈ నిర్ణయం వల్ల ప్రాథమిక విద్యపై తీవ్ర ప్రభావం చూపుతుందని డీటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీశైలం, ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక తరగతి గదికి ఒక్క ఉపాధ్యాయుడు చొప్పున ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులు వాటివైపు మొగ్గుచూపుతున్నారని, నిబంధనల ప్రకారం 1:30 మంది ఉపాధ్యాయులు ఉండాలన్న నిబంధన కాగితాలకే పరిమితమైందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా, పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు అద్భుతాలు సృష్టించారు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అద్భుతాలు సృష్టించారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు ఎమ్మెల్యే సౌజన్యంతో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి లో విద్యార్థులు సాధించిన ఫలితాలు కార్పొరేట్ విద్యా సంస్థలలో విద్యార్థులతో సమానంగా వచ్చాయన్నారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెంటనే నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అక్కడ డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయడం, డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందించడంతో 45% ఉన్న ఫలితాలు ఒకేసారి 20 నుంచి 30 % పెరిగాయని తెలిపారు. ఈసారి మరింత శ్రద్ధ వహించి ఏఎంఓ, సీఎంఓ, ఎంఈఓ, డీఈఓలను కోఆర్డినేషన్ చేయడంతో గతంలో కంటే మెరుగ్గా ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ఇంకా కొన్ని పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, అలాంటి పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తప్పకుండా దినపత్రికలు చదివే అలవాటు చేసుకోవాలని, పత్రికలు చదివితే ఎన్నో పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పిస్తే అత్యున్నతమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. గత విద్యా సంవత్సరం మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు ఆధ్వర్యంలో ఇచ్చిన ఎంసెట్, నీట్ కోచింగ్ పొందిన విద్యార్థులకు ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీలలో 114 మందికి రాష్ట్ర స్థాయి ర్యాంకులు వచ్చాయని, వచ్చే విద్యా సంవత్సరం రెండింతలు ర్యాంకులు మన మహబూబ్‌నగర్ బిడ్డలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ బిడ్డలకు కాస్త ప్రోత్సాహం ఇస్తే చాలని, వారు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారన్నారు. రానున్న రెండేళ్లు చదువుపైన శ్రద్ధ వహించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎలాంటి వసతులు కావాలన్నా తప్పక కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 500 మార్కులు పైన వచ్చిన విద్యార్థులను ఎమ్మెల్యే గారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్ కుమార్, డీఐఈఓ కౌసర్ జహాన్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, సీఎంఓ బాలు యాదవ్, ఏఎంఓ డీ.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డు నుంచి భూత్పూర్–చించోళి జాతీయ రహదారి వరకు రూ.65.50 లక్షలతో నిర్మించే వంద మీటర్ల మేర బీటీ రోడ్డు, డ్రెయిన్, కాజ్‌వే పనులకు శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.మహేందర్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, గుండా మనోహర్, లక్ష్మణ్ నాయక్, శ్రీను, ఉమర్, మునీర్, ఫక్ళ, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

- ఎంపీ డీకే అరుణ
- ముగిసిన అయ్యప్ప ప్రీమియర్ లీగ్



ఏపీఎల్‌లో బ్యాటింగ్ చేస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అయ్యప్ప ప్రీమియర్ లీగ్ శనివారం ముగింపు కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడారు. క్రికెట్ ఆడి సందడి చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

– క్రీడలు మానసిక వికాసానికి దోహదం

ఏపీఎల్ లీగ్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో మెళకువలు నేర్చుకోవాలని, జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అయ్యప్ప ప్రీమియర్ లీగ్‌లో విన్నర్ అరవింద్ లెవన్, రన్నరప్ రాహుల్ వీఆర్‌బీ జట్లకు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, అమరేందర్ రాజు, సీమ నరేందర్ ట్రోఫీలు అందజేశారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం

రాజాపూర్: కనిపించని మృత్యువు కరెంట్, కరెంట్‌తో వర్షాకాలంలో ప్రజలు చాలా జాగ్రతగా ఉండాలని మండల విద్యుత్‌శాఖ అధికారి వెంకటేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయంలో ఆయన విద్యుత్ వినియోగదారులకు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో, వర్షం తగ్గిన వెంటనే ఎట్టి పరిస్థితుల్లో కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దని అన్నారు. ముఖ్యంగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్ తీగల కింద నిలుచో రాదని, గాలి వీచే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడే అవకాశం ఉంటుందన్నారు. ఇంటికి సరఫరా అయ్యో సర్వీస్ వైరు ఇంటిపై రేకులపై, తడిబట్టలను ఆరేసే తీగలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ రైతులు రోజువారి తమ బోర్లవద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. బోరు పంపు, స్టాటర్‌ను తడిచేతులతో తాకవద్దన్నారు. బోర్లు రిపేరు చేస్తున్న సమయంలో పైన విద్యుత్ వైర్లు ఉంటే జాగ్రతలు తీసుకోవాలన్నారు. గ్రామాల ప్రజలు, రైతులు ఐఎస్ఐ మార్కు ఉన్న సర్వీస్ వైర్లను వాడాలని, విద్యుత్ సమస్యలు ఏవైనా ఎక్కడైనా ఉంటే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

తుంపర సేద్యం పరికరాల పంపిణీ



కంచన్‌పల్లిలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ గ్రామంలో 75శాతం రాయితీ మీద ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంజూరైన తుంపర సేద్యం పరికరాలు 18 మంది రైతులకు శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అందజేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, రైతులు సబ్సిడీ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, ఉద్యానశాఖ అధికారి మహేందర్, నాయకులు అల్వాల్‌రెడ్డి, రాజారెడ్డి, సత్యం, సాయిలు, గౌస్, వెంకటయ్య, పాల్గొన్నారు.

కంచన్‌పల్లిలో ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు

మండలంలోని కంచన్‌పల్లిలో శనివారం బొడ్రాయి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులు ఐక్యమత్యంతో ఇలాంటి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవడం ఎంతో సంతోషమన్నారు. వారిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, నాయకులు రబ్బానీ, సాయిలు, గౌస్, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, బంగారు, సత్యం, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మహమ్మదాబాద్: అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. శనివారం మండలంలోని మంగంపేట్, మంగంపేట్ తండా, కంచన్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో అర్హులైన వారందరికి రెండో విడతలో ఇళ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఇందిరమ్మ కమిటీలు అర్హులను గుర్తించాలని సూచించారు. ఇళ్లను వేగవంతంగా నిర్మించాలన్నారు. పథకాలవర్తింపులో ఎలాంటి అవకతవకలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతిబాయి, నాయకులు ముకుందం, గృహ నిర్మాణశాఖ ఏఈ బసప్ప, వెంకట్రాములు, పవన్, నర్సింహారెడ్డి, మోతీలాల్ పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

జడ్చర్ల: మండలంలో 3 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నర్సింగ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 3న ఈర్లపల్లి, ఆల్వాన్‌పల్లి, 4న ఖానాపూర్, నెక్కొండ, 5న కిష్టారం, అంబటాపూర్, కోడ్గుపర్తి, 6న గొల్లపల్లి, అమ్మపల్లి, 9న చిట్టిబోయిన్‌పల్లి, పెద్ద ఆదిరాల, 10న మల్లెబోయిన్‌పల్లి, చిన్న ఆదిరాల, 11న శంకరాయపల్లి, కండేడు, 12న మాచారం, గోప్లాపూర్, 13న బూరెడ్డిపల్లి, రోర్గల్, 16న పోలేపల్లి, గంగాపూర్, 17న వల్లూరు, నాగసాల, కిష్టంపల్లి, 18న ఉదండాపూర్, ఆలూరు, 19న జడ్చర్ల, బూర్గుపల్లి, 20 నసరుల్లాబాద్, బాదేపల్లిలో సదస్సులు ఉంటాయని తెలిపారు. రైతులు సమస్యలను సదస్సులలో తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: రూరల్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను బీసీ జేఏసీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని బీసీ జేఏసీ జిల్లా నాయకుడు మైత్రి యాదయ్య తహసీల్దార్‌కు విన్నవించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్‌ను సన్మానించిన వారిలో ఆర్టీఏ మెంబర్ మూసంగి వెంకటేష్, జర్నలిస్టు చందు, మన్యంకొండ పాలక మండలి సభ్యుడు ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు రవీందర్, తెలుగు గూడెం ఆంజనేయులు, వెంకట్రాములు, గానుగ కుర్మయ్య, కృష్ణయాదవ్, వెంకటేష్, బోయ ఆంజనేయులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఎద్దుల పట్టివేత

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో భాగంగా అక్రమంగా తరలిస్తున్న మూడు ఎద్దులను పశు సంవర్ధకశాఖ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఉస్సేన్ ట్రాలీ ఆటోలో శనివారం పెబ్బేర్ సంత నుంచి మూడు ఎద్దులను తరలిస్తున్నాడు. శాఖాపూర్ టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేపట్టిన పశు సంవర్ధకశాఖ సిబ్బంది ట్రాలీ ఆటోను నిలిపి తనిఖీ చేశారు. అందులో మూడు ఎద్దులు ఉండగా వాటికి సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో ట్రాలీ ఆటోను పోలీసులకు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎద్దులను హన్వాడ మండలం చిన్నదర్పల్లి గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

'కాలనీల్లో పందులను నివారించాలి'



పందుల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పందులను నివారించాలని పందుల యజమానులకు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో పందుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. అన్ని వార్డుల్లోనూ పందుల సంఖ్య పెరుగుతోందని తమకు ఫిర్యాదులు అందుతున్నాయని కమిషనర్ వారికి వివరించారు. మరింతగా పెరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ నాగేష్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించారు. మున్సిపాలిటీ ఏఈ మేఘనతో కలిసి ఆయన ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు పోయించి పనులు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేసుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు.

చిన్నారులకు సత్కారం



జడ్చర్ల టౌన్: సికింద్రాబాద్ జింఖానగ్రౌండ్‌లో ఆదివారం జరిగే రాష్ట్ర అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైన చిన్నారులను శనివారం స్థానిక స్టేడియం మైదానంలో ఘనంగా సత్కరించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఎంపికైన ముగ్గురు చిన్నారులను సత్కరించి వారికి షూ స్పాన్సర్ చేశారు. వాలీబాల్ నెట్‌ను స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, కరాటే శ్రీను, శ్రీనివాసులు, కింగ్ ఖాజా, జయరాజ్, ఆనంద్, కోచ్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ శనివారం ఢిల్లీలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయన చర్చించినట్లు పేర్కొన్నారు.

11న వేంకటేశ్వరస్వామి కల్యాణం



కరపత్రాలు విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

అమరచింత: మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 11న లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పారుపల్లి చింతన్న, పొబ్బతి వెంకటస్వామి తెలిపారు. ఆలయ నిర్మాణం నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా ఏటా స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కల్యాణ ఏర్పాట్లను తెలియచేసే కరపత్రాలను ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల అనంతరం విడుదల చేశారు. పట్టణ ప్రజలు స్వామివారి కల్యాణ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ మండలాల్లో ఎరుకల యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణాలు మంజూరు చేయాలని ఏకలవ్య ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగిరి నర్సింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలులో భాగంగా మొదటగా రూ. 50వేలు, రూ.1,00,000 రుణ మంజూరులో ఎరుకలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. 2025–26 యాక్షన్ ప్లాన్ ప్రకారం అర్హత గల ఎరుకల యువతను గుర్తించి ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయించాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధి చేకూర్చడంలో ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సినీ నటుడు కృష్ణ విగ్రహావిష్కరణ



కృష్ణ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాత డీఈఓ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సినీ నటుడు, దివంగత సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని శనివారం అభిమాన సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ పూల దండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు రాజగోపాల్, పాతూరు రమేష్, రఘుపతి రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమోహన్, కాంగ్రెస్ నాయకులు అమరేందర్ రాజు, హనుమంతు, కిట్టు, పాషా పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. జర మేలుకో!

- రోడ్డు మధ్యలో స్తంభాలు.. ప్రయాణానికి ఇబ్బందులు



నవాబుపేటలో హనుమాన్ దేవాలయం సమీపంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు

నవాబుపేట: నడి రోడ్డులో స్తంభాలు ఉండడం వల్ల వాహనాలకు, ప్రయాణికులకు ఎన్నో ఇబ్బందులు కలిగిస్తున్నాయని, దీన్ని విద్యుత్ అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయం సమీపంలో జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రోడ్డులో మూడు విద్యుత్ స్తంభాలు రోడ్డులోనే ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. చౌడూర్‌లో ప్రధాన రోడ్డులోనే విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. గ్రామాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్లు వేశారు. కానీ రోడ్లు కానీ రోడ్డులో మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు మాత్రం సంబంధిత అధికారులు తొలగించడం లేదు. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ విషయంలో ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ఎప్పుడు?

- చివరి దశలో పనులు



పెద్దమునుగల్‌ఛేడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌ఛేడ్ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చివరి దశకు చేరడంతో ఇళ్లు లేని నిరుపేదలు తమకు ఇళ్లను ఎప్పుడు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. వనపర్తి నియోజకవర్గంలోని గ్రామం కావడంతో అప్పటి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గ్రామానికి 50 డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేశారు. 2021 అక్టోబర్ 10న ఇళ్ల నిర్మాణాలకు అప్పటి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్ ద్వారా నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ జీప్లస్ వన్ పద్ధతిన 50 ఇళ్లు నిర్మించారు. రెండేళ్ల కిందనే భవన నిర్మాణం పనులు పూర్తయినా అందులో కొన్ని చిన్న చిన్న పనులు మిగిలిపోవడంతో వాటిని పూర్తి చేయడానికి సమయం పట్టింది. ప్రస్తుతం ఇళ్ల సముదాయం చుట్టు పైప్‌లైన్‌కు సంబంధించిన పనులు చేస్తున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తయితే లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించడమే మిగులుతుంది. అయితే నాలుగేళ్ల కిందట మొదలైన ఇళ్ల నిర్మాణం పనులు ఇంకా కొనసాగుతుండటంతో ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇళ్ల నిర్మాణం ఏళ్ల తరబడి సాగడంతో మందుబాబులు తమ అడ్డాగా మార్చుకున్నారు. ఇళ్ల ఆవరణతో పాటు పైకప్పుపై మద్యం సిట్టింగులు చేస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. రెండేళ్ల కిందటే ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తారని ప్రచారం సాగినా చివరి దశ పనులు మిగిలిపోవడంతో కేటాయింపు నిలిచి పోయింది. ఇప్పుడు చివరి దశ పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నందున సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఇళ్లు లేని వారు ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించుకుని ఇళ్లను నిర్మించుకోవడానికి సంశయిస్తున్నారు. తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు వస్తుందన్న ఆశతో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లను నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపును త్వరగా పూర్తి చేస్తే అందులో అవకాశం రాని వారు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లను నిర్మించుకునే అవకాశం ఉంది. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందించి డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పనులను త్వరగా పూర్తి చేయించి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.